## ఎన్‌సీసీకి 3,389 కోట్ల ఆర్డర్

హైదరాబాద్, నవంబర్ 29: రాష్ట్రానికి చెందిన ప్రముఖ మౌలిక సదుపాయాల సంస్థ ఎన్‌సీసీ లిమిటెడ్‌కి మరో అతిపెద్ద ఆర్డర్‌ను చేజిక్కించుకున్నది. కెన్-బెట్వా లింక్ ప్రాజెక్టు కింద నిర్మిస్తున్న రూ.3,389.49 కోట్ల విలువైన దౌధన్ డ్యామ్ ఆర్డర్ లభించినట్లు సంస్థ వెల్లడించింది. ఈ భారీ ఆర్డర్‌కు సంబంధించి నిర్వహించిన బిడ్డింగ్‌లో సంస్థ తక్కువ కోడ్ చేసి దక్కించుకున్నదని వెల్లడించింది. ఈ ఉత్తర్వులను వచ్చే 72 నెలల్లో(ఆరేండ్లలో) అమలు చేయాల్సి ఉంటుందని తెలిపింది. ఈ ప్రాజెక్టునకు సంబంధించి ప్లానింగ్, డిజైనింగ్, ఇంజినీరింగ్, హైడ్రో-మెకానికల్ పనులు ఈపీసీ(ఇంజినీరింగ్, ప్రొక్యూర్‌మెంట్ అండ్ కన్‌స్ట్రక్షన్) నిర్వహించాల్సి ఉంటుందని తెలిపింది.


## బీఎండబ్ల్యూ బైకులు ప్రియం

న్యూఢిల్లీ, నవంబర్ 29: లగ్జరీ కార్ల సంస్థ బీఎండబ్ల్యూకి చెందిన ద్విచక్ర వాహన డివిజన్ బీఎండబ్ల్యూ మోటోరాడ్ కూడా తన వాహన ధరలు పెంచబోతున్నట్లు ప్రకటించింది. జనవరి 1, 2025 నుంచి అమలులోకి వచ్చేలా అన్ని రకాల ద్విచక్ర వాహన ధరలను 2.5 శాతం వరకు పెంచుతున్నట్లు శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడించింది. ఉత్పత్తి వ్యయం పెరగడంతోపాటు ద్రవ్యోల్బణ ఒత్తిడి కారణంగా ధరలను పెంచాల్సి వచ్చిందని తెలిపింది.

## స్కిల్ వర్సిటీలో భాగస్వామ్యం కండి

**విప్రో ప్రతినిధులతో శ్రీధర్ బాబు**

హైదరాబాద్, నవంబర్ 29 (నమస్తే తెలంగాణ): యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీలో విప్రో సంస్థ భాగస్వామ్యం కావాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కోరారు. హైదరాబాద్‌లో విప్రో కార్యకలాపాల పురోగతిని వివరించేందుకు ఆ సంస్థ చీఫ్ ఫైనాన్షియల్ అధికారి రాఘవ్ స్వామినాథన్ మంత్రిని కలిశారు. ఈ సందర్భంగా శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. విప్రో సంస్థకు అవసరమయ్యే వారికి స్కిల్ యూనివర్సిటీలో శిక్షణ ఇచ్చి నియమించుకోవాలని సూచించారు. డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్ ఇదే తరహాలో 80 మంది నిరుద్యోగ యువతకు శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. ఎఫ్ఎంసీజీ ఉత్పత్తుల పరిశ్రమలను ద్వితీయ శ్రేణి నగరాల్లో ఏర్పాటు చేయాలని రాఘవ్‌ను కోరారు.




# వృద్ధికి బీటలు

## రెండేండ్ల కనిష్ఠానికి జీడీపీ పతనం

**జులై-సెప్టెంబర్‌లో 5.4 శాతమే • తయారీ, గనుల రంగాలు పేలవం • వినిమయ శక్తి బలహీనం**

న్యూఢిల్లీ, నవంబర్ 29: దేశ ఆర్థిక వృద్ధి రేటు దాదాపు రెండేండ్ల కనిష్ఠానికి దిగజారింది. శుక్రవారం విడుదలైన జాతీయ గణాంక కార్యాలయం (ఎన్ఎస్‌వో) వివరాల ప్రకారం ఈ ఆర్థిక సంవత్సరం (2024-25) రెండో త్రైమాసికం (జూలై-సెప్టెంబర్)లో జీడీపీ 5.4 శాతానికే పరిమితమైంది. 2022-23 ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికం (అక్టోబర్-డిసెంబర్)లో 4.3 శాతంగా నమోదైంది. మళ్లీ ఆ దరిదాపుల్లో వృద్ధి గణాంకాలుండటం ఇప్పుడే. కాగా, తొలి త్రైమాసికం (ఏప్రిల్-జూన్)లో ఇది 6.7 శాతంగా ఉంటే.. గత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో 8.1 శాతంగా ఉండటం గమనార్హం. దీంతో కాలం గడుస్తున్నకొద్దీ వృద్ధిరేటు అంతకంతకూ పడిపోతున్న సంకేతాలే కనిపిస్తున్నాయి.

**తయారీ, గనులు నిరాశాజనకం..**

తయారీ, గనుల రంగాల పనితీరు నిరాశాజనకంగా ఉన్నట్టు తాజా గణాంకాల్లో తేలింది. తయారీ రంగ కార్యకలాపాలు 2.2 శాతానికి, గనుల రంగంలో ఉత్పాదకతైతే 0.01 శాతానికి క్షీణించాయి. ఏడాది క్రితం ఇవి వరుసగా 14.3 శాతంగా, 11.1 శాతంగా ఉండటం విశేషం. రియల్టీ తదితర రంగాల్లో వృద్ధి పెరిగినా అది స్వల్పమే. ఇక వినియోగదారుల కొనుగోలు శక్తి సైతం పడిపోయినట్టు స్పష్టమవుతున్నది. ఈ ఏప్రిల్-జూన్‌లో 7.4 శాతంగా ఉంటే, జూలై-సెప్టెంబర్‌లో 6 శాతంగానే ఉన్నది. దేశ జీడీపీ బలంగా ఉండాలంటే మార్కెట్‌లో డిమాండ్ ముఖ్యం. కానీ వినిమయ శక్తి తగ్గిపోతే డిమాండ్ కూడా ఉండదు.

**బేస్ ఇయర్ మార్పు!**

జీడీపీ కంప్యూటేషన్ కోసం బేస్ ఇయర్‌ను 2022-23కు మార్చాలని కేంద్రంలోని నరేంద్ర మోదీ సర్కారు యోచిస్తున్నది. అంతా కుదిరితే 2026 ఫిబ్రవరి నుంచి ఇది అమల్లోకి రావచ్చంటున్నారు. బేస్ ఇయర్ మారితేనే దేశ ఆర్థిక వ్యవస్థ ప్రగతికి సంబంధించి కచ్చితమైన సమాచారం వస్తుందని ప్రభుత్వ వర్గాలు చెప్తున్నాయి. కాగా, ప్రస్తుతం 2011-12 బేస్ ఇయర్‌గా ఉన్నది. ఈ సంవత్సరంలోని ధరల ఆధారంగానే వృద్ధి రేటును లెక్కిస్తున్నారు. గతంలో ఇది 2004-05గా ఉండేది. ఇదిలావుంటే వచ్చే జనవరి నుంచి నెలనెలా పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే అంచనాలుంటాయని కేంద్ర గణాంకాలు, ప్రణాళిక అమలు మంత్రిత్వ శాఖ కార్యదర్శి సౌరభ్ గార్గ్ తెలిపారు. కాగా, ఈ ఆర్థిక సంవత్సరానికిగాను అక్టోబర్ నెల ముగిసే నాటికి కేంద్ర ప్రభుత్వ ఆర్థిక లోటు పూర్తి ఏడాదికాల లక్ష్యంలో 46.5 శాతంగా నమోదైంది. ప్రభుత్వ ఆదాయ-వ్యయాల మధ్య వ్యత్యాసాన్నే ఆర్థిక లోటుగా పరిగణిస్తారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం దీన్ని రూ.16,13,312 కోట్లకు కట్టడి చేయాలని మోదీ సర్కారు లక్ష్యంగా పెట్టుకున్నది. అయితే తొలి ఏడు నెలల్లో రూ.7,50,824 కోట్లకు వచ్చింది.



*రెండో త్రైమాసికంలో దేశ జీడీపీ వృద్ధిరేటు 5.4 శాతానికి క్షీణించడం అసంతృప్తికరమే. అయినప్పటికీ మొత్తం ఈ ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించుకున్న 6.5 శాతం లక్ష్య సాధనకు వచ్చిన ముప్పేమీ లేదు.*

**-వీ అనంత నాగేశ్వరన్, కేంద్రప్రభుత్వ ప్రధాన ఆర్థిక సలహాదారు**



*జూలై-సెప్టెంబర్‌లో జీడీపీ వృద్ధిరేటు ఊహించినదానికంటే బాగా తగ్గిపోయింది. కీలక రంగాల్లో నిస్తేజం కనిపించింది. తయారీ, గనుల రంగాల్లో ఉత్పాదకత రేటు మరీ దారుణంగా నమోదైంది.*

**-అదితి నాయర్, ఐసీఆర్ఏ ప్రధాన ఆర్థికవేత్త**

## మెప్పించని మౌలికం

*బొగ్గు, ఎరువులు, ఉక్కు, సిమెంట్, విద్యుత్తు, ముడి చమురు, సహజ వాయువు, రిఫైనరీ ఉత్పత్తుల రంగాల్లో ఉమ్మడి వృద్ధిరేటు ఈ ఏడాది అక్టోబర్ నెలలో క్షీణించింది. 3.1 శాతంగానే ఉన్నట్టు తాజా అధికారిక గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. గత ఏడాది అక్టోబర్‌లో ఈ 8 కీలక రంగాల ఉత్పాదకతలో వృద్ధిరేటు 12.7 శాతంగా నమోదు కావడం గమనార్హం. ముడి చమురు, సహజ వాయువు ఉత్పత్తి క్షీణించినట్టు స్పష్టమైంది. కాగా, ఈ ఏప్రిల్-అక్టోబర్ మధ్య ఈ రంగాల వృద్ధిరేటు 4.1 శాతం వద్దే ఆగిపోయింది. నిరుడు ఇదే వ్యవధిలో 8.8 శాతంగా ఉన్నది. దేశ పారిశ్రామికోత్పత్తి సూచీ (ఐఐపీ)లో ఈ 8 రంగాల వాటా 40.27 శాతంగా ఉండగా, వీటి పనితీరు ఐఐపీని గట్టిగానే ప్రభావితం చేస్తుంది.*

# విమానాల్లో బ్లాక్ ఫ్రైడే ఆఫర్లు

**20 శాతం వరకు ఎయిర్ ఇండియా ఆఫర్ • రూ.1,199కే ఇండిగో ప్రారంభ టికెట్**

న్యూఢిల్లీ, నవంబర్ 29: విమాన ప్రయాణికులను ఆకట్టుకోవడానికి పలు విమానయాన సంస్థలు ప్రత్యేకంగా 'బ్లాక్ ఫ్రైడే సేల్స్' ఆఫర్లను ప్రకటించాయి. దేశీయ విమానయాన దిగ్గజం ఇండిగోతోపాటు ఎయిర్ ఇండియా ఈ ప్రత్యేక ఆఫర్లను అందుబాటులోకి తీసుకొచ్చాయి. దీంట్లో ఇండిగో ఒకవైపు ప్రారంభ విమాన టికెట్ ధరను రూ.1,199గా నిర్ణయించింది. అంతర్జాతీయ రూట్‌లో రూ.5,199కే అందిస్తున్నది. ఈ ఆఫర్ కింద బుకింగ్ చేసుకున్న ప్రయాణికులు జనవరి 1 నుంచి మార్చి 31, 2025లోపు ఎప్పుడైనా ప్రయాణించవచ్చును. అలాగే ఎయిర్ ఇండియా విమాన టికెట్ల బేస్‌రేట్‌పై 20 శాతం వరకు తగ్గింపు ధరకు విక్రయిస్తుండగా..అంతర్జాతీయ రూట్లపై 12 శాతం తగ్గింపునిస్తున్నది. ఈ ఆఫర్ కింద బుకింగ్ చేసుకున్న ప్రయాణికులు జూన్ 30, 2025 లోపు ప్రయాణించాల్సి ఉంటుంది. భారత్ నుంచి ఆస్ట్రేలియా లేదా ఉత్తర అమెరికాల మధ్య మాత్రం అక్టోబర్ 30, 2025 లోపు ఎప్పుడైనా ప్రయాణించవచ్చును. ఎయిర్ ఇండియా వెబ్‌సైట్, మొబైల్ యాప్ ద్వారా బుకింగ్ చేసుకోవాల్సి ఉంటుందని, లిమిటెడ్ సీట్లు ఉండగా, తొలుత వచ్చిన వారికి మాత్రమే ఈ ఆఫర్ లభించనున్నదని పేర్కొంది. ఈ ఆఫర్లు డిసెంబర్ 2 వరకు అందుబాటులో ఉండనున్నాయి.




# సబ్బుల ధరలకు రెక్కలు

***8% వరకు పెంచిన ఎఫ్ఎంసీజీలు • పామాయిల్ ధరలు పెరగడం వల్లనే..***

న్యూఢిల్లీ, నవంబర్ 29: సబ్బుల ధరలకు రెక్కలొచ్చాయి. దేశంలో అతిపెద్ద ఎఫ్ఎంసీజీ సంస్థలు అన్ని రకాల సబ్బుల ధరలను పెంచుతున్నట్లు ప్రకటించాయి. పామాయిల్ ధరలు ఇబ్బడిముబ్బడిగా పెరగడం వల్లనే వీటి ధరలను 7 శాతం నుంచి 8 శాతం వరకు పెంచాల్సి వచ్చిందని హెచ్‌యూఎల్, విప్రో సంస్థలు ప్రకటించాయి. సబ్బుల తయారీలో కీలక ముడి సరుకైన పామాయిల్ ధర అంతర్జాతీయ మార్కెట్లో భగ్గుమన్నది. దీంతో పడుతున్న అదనపు భారాన్ని తగ్గించుకోవడానికి సబ్బుల ధరలు పెంచకతప్పలేదని సంస్థలు పేర్కొన్నాయి. మార్జిన్లు తగ్గుముఖం పట్టడంతో వీటి ధరలను ప్రస్తుత త్రైమాసికంలో పెంచాల్సి ఉంటుందని గత త్రైమాసికపు ఆర్థిక ఫలితాలు సందర్భంగా ప్రకటించాయి కూడా. సబ్బుల తయారీలో కీలక ముడిసరుకైన పామాయిల్ ధరలు గడిచిన ఏడాదికాలంలో 30 శాతం వరకు పెరిగాయని విప్రో కన్జ్యూమర్ కేర్ సీఈవో నీరజ్ ఖత్రియా తెలిపారు. మిగతా సంస్థలు కూడా తమ సబ్బుల ధరలను 7-8 శాతం వరకు పెంచుతాయని అనుకుంటున్నట్లు చెప్పారు. గడిచిన మూడు నెలల్లోనే పామాయిల్ ధరలు 35 శాతం నుంచి 40 శాతం వరకు పెరిగాయి. అంతర్జాతీయంగా ధరలు పెరగడంతోపాటు దిగుమతి సుంకం పెరగడం ఇందుకు కారణం. ప్రస్తుతం పది కిలోల పామాయిల్ ధర రూ.1,370గా ఉన్నది.

**టీ పొడి ధరలు కూడా..**

టీ పొడి ధరలు కూడా పెంచాయి సంస్థలు. అస్థిర వాతావరణ పరిస్థితుల కారణంగా టీ ఉత్పత్తి గణనీయంగా పడిపోవడం వల్లనే ధరలు సవరించాల్సి వచ్చిందని హెచ్‌యూఎల్, టాటా కన్జ్యూమర్ సంస్థలు ప్రకటించాయి. టీ పొడి ధరలను 25 శాతం నుంచి 30 శాతం వరకు సవరించినట్లు టాటా కన్జ్యూమర్ ప్రొడక్ట్ ఇప్పటికే ప్రకటించింది కూడా.

- **విప్రో కన్జ్యూమర్ కేర్..సంతూర్, చంద్రిక పేర్లతో సబ్బులను విక్రయిస్తున్నది.**
- హెచ్‌యూఎల్..డోవ్, లక్స్, లైఫ్‌బాయ్, లిరిల్, పీయర్స్, రెగ్జోనా బ్రాండ్లతో సబ్బులను అమ్ముతున్నది.
- **లక్స్ సబ్బు (5 సబ్బులు) ప్యాక్ ధర రూ.145 నుంచి రూ.155కి పెరిగింది.**
- లైఫ్‌బాయ్(5 సబ్బులు) ప్యాక్ విలువ రూ.155 నుంచి రూ.165కి పెంచారు.
- **ఐదు ప్యాక్ కలిగిన పీయర్స్ సబ్బుల ధర రూ.149 నుంచి రూ.162కి సవరించారు.**

# రూపీ.. ఆల్‌టైమ్ లో

**ఒక్కరోజే 13 పైసలు పతనం • 84.60 వద్దకు మారకపు విలువ క్షీణత**

ముంబై, నవంబర్ 29: డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ శుక్రవారం ఆల్‌టైమ్ కనిష్ఠానికి దిగజారింది. ఈ ఒక్కరోజే 13 పైసలు పడిపోయి మునుపెన్నడూ లేనివిధంగా భారతీయ కరెన్సీ 84.60 వద్దకు క్షీణించింది. దేశ జీడీపీ వృద్ధిరేటు దాదాపు రెండేండ్ల కనిష్ఠానికి పతనం కావడం.. విదేశీ మదుపరులు తమ పెట్టుబడులను అదేపనిగా ఉపసంహరించుకుంటుండటం ఓవరాల్ సెంటిమెంట్‌ను దెబ్బతీసిందని ఫారెక్స్ మార్కెట్ ట్రేడర్లు తాజా సరళిని విశ్లేషిస్తున్నారు. దీనికితోడు దేశంలోని దిగుమతిదారుల నుంచి డాలర్లకు పెరిగిన డిమాండ్ కూడా రూపీని బలహీనపర్చిందని చెప్తున్నారు. నిజానికి ఇటీవలికాలంలో డాలర్ ముందు రూపీ వెలవెలబోతూనే ఉన్నది. ఒక్కరోజే 10 పైసలకుపైగా క్షీణించిన సందర్భాలు అనేకం ఉన్నాయంటే కరెన్సీ మార్కెట్‌లో రూపాయి ఎదుర్కొంటున్న ఒత్తిడిని అర్థం చేసుకోవచ్చు. రూపాయి విలువ ఇలాగే పడిపోతే ఆ ప్రభావం.. ద్రవ్యోల్బణం, వడ్డీరేట్లు, జీడీపీలపై గట్టిగానే పడవచ్చని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు.

**కోలుకున్న స్టాక్ మార్కెట్లు**

భారీ నష్టాల నుంచి దేశీయ స్టాక్ మార్కెట్లు శుక్రవారం కోలుకున్నాయి. బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 759.05 పాయింట్లు లేదా 0.96 శాతం ఎగిసి 79,802.79 వద్ద స్థిరపడింది. ఒకానొక దశలో 880.16 పాయింట్లు పెరగడం గమనార్హం. ఇక ఎన్ఎస్ఈ సూచీ నిఫ్టీ కూడా 216.95 పాయింట్లు లేదా 0.91 శాతం ఎగబాకి 24వేల స్థాయికి ఎగువన 24,131.10 వద్ద నిలిచింది. భారతీ ఎయిర్‌టెల్, మహీంద్రా అండ్ మహీంద్రా, అల్ట్రాటెక్ సిమెంట్, అదానీ పోర్ట్స్, రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్లు అత్యధికంగా లాభపడ్డాయి. రంగాలవారీగా హెల్త్‌కేర్, టెలీకమ్యూనికేషన్స్, ఎనర్జీ, టెక్నాలజీ షేర్లు రాణించాయి. బీఎస్ఈ స్మాల్‌క్యాప్ 0.76 శాతం, మిడ్‌క్యాప్ 0.31 శాతం మేర పుంజుకున్నాయి. గురువారం సెన్సెక్స్ 1,190, నిఫ్టీ 361 పాయింట్లు నష్టపోయిన విషయం తెలిసిందే.



## తగ్గిన విదేశీ నిల్వలు

ముంబై, నవంబర్ 29: విదేశీ మారకం నిల్వలు కరిగిపోతున్నాయి. ఇప్పటికే భారీ స్థాయిలో కరిగిపోయిన నిల్వలు ఈ నెల 22తో ముగిసిన వారాంతానికిగాను ఫారెక్స్ రిజర్వులు 1.31 బిలియన్ డాలర్లు తగ్గి 656.582 బిలియన్ డాలర్లకు చేరుకున్నట్లు రిజర్వు బ్యాంక్ తన వారాంతపు సమీక్షలో వెల్లడించింది. అంతక్రితం వారంలో రిజర్వులు 17.761 బిలియన్ డాలర్లు తగ్గిన విషయం తెలిసిందే. విదేశీ కరెన్సీ రూపంలో ఉన్న ఆస్తుల విలువ తరిగిపోవడం వల్లనే రిజర్వులు తగ్గుతున్నాయని తెలిపింది. వీటి విలువ 3.043 బిలియన్ డాలర్లు తరిగిపోయి 566.791 బిలియన్ డాలర్లకు చేరాయి. అలాగే గోల్డ్ రిజర్వులు మాత్రం 1.828 బిలియన్ డాలర్లు పెరిగి 67.573 బిలియన్ డాలర్లకు చేరాయి.

# చరిత్రలో నిలిచిన కేసీఆర్

- **తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన వీరుడు**
- **అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలు**
- **దీక్షా దివస్ ఇన్‌చార్జి కొండబాల కోటేశ్వరరావు**

మహబూబాబాద్ రూరల్, నవంబర్ 29 : రాష్ట్ర సాధనలో కేసీఆర్ చేసిన ఉద్యమ తీరు చరిత్రలో నిలిచిపోతదని మాజీ ఎమ్మెల్యే, దీక్షా దివస్ మానుకోట జిల్లా ఇన్‌చార్జి కొండబా ల కోటేశ్వరరావు అన్నారు. శుక్రవారం మహబూబాబాద్‌లో మాజీ ఎంపీ మాలోత్ కవిత అధ్యక్షతన దీక్షా దివస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ తెలంగాణ మలిదశ ఉద్యమంలో కేసీఆర్ అన్ని వర్గాల ప్రజలను కూడగట్టి శాంతియుత మార్గంలో నడిపించారన్నారు. ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం కేసీఆర్ ఆమరణ దీక్ష చేపట్టారని, దీంతో అప్పటి ప్రభుత్వం దిగివచ్చి సానుకూలంగా ప్రకటన చేసిందన్నారు. మళ్లీ ఆంధ్ర పాలకులు అడ్డుకోవడంతో ప్రకటనను వెనక్కి తీసుకున్నారని పేర్కొన్నారు. 'తెలంగాణ వచ్చుడో.. కేసీఆర్ సచ్చుడో' అనే నినాదంతో ప్రత్యేక రాష్ట్రాన్ని కేసీఆర్ సారథ్యంలో సాధించామన్నారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఆయన అన్ని రంగాల్లో అభివృద్ధి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్ రెడ్డి, వైస్‌చైర్మన్ మార్నేని వెంకన్న, పర్కాల శ్రీనివాస్ రెడ్డి, భరత్ కుమార్ రెడ్డి, నాయిని రంజిత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కోటి ఎకరాల మాగాణి ఘనత కేసీఆర్‌దే

తెలంగాణ ఉద్యమం, రాష్ట్ర అభివృద్ధిలోనూ కేసీఆర్ పాత్ర కీలకం. గతంలో 25 లక్షల విస్తీర్ణంలో మాగాణిని కోటి ఎకరాల్లోకి తీసుకొచ్చారు. కేసీఆర్ వల్లే పంటలు సమృద్ధిగా పండి తెలంగాణ ధాన్యాగారమైంది. ఆనాటి ఉద్యమ చరిత్రకు, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు కేసీఆర్ చేసిన దీక్షకు ప్రాధాన్యం ఉంది.

**- మాలోత్ కవిత, మాజీ ఎంపీ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు**

## తెలంగాణ పథకాలు దేశానికి ఆదర్శం

ప్రత్యేక రాష్ట్ర సాధనతో పాటుగా రాష్ట్రంలో కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు దేశానికి ఆదర్శంగా నిలిచాయి. దళిత బంధు, కల్యాణలక్ష్మి, రైతుబంధు, రైతుబీమా, ఉచిత విద్యుత్ రాష్ట్రంలో మాత్రమే అమలయ్యాయి.

**- ధరంసోత్ రెడ్యా నాయక్, మాజీ ఎమ్మెల్యే**

## కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి

కాంగ్రెస్ పార్టీ ప్రజా వ్యతిరేక విధానాలు ఎండ గడుతూ, బీఆర్ఎస్ పార్టీని బలోపేతం చేసేందుకు కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి. పార్టీలో కష్టపడిన ప్రతి ఒక్కరికి గుర్తింపు ఉంటుంది. ప్రతి ఒక్కరికి బీఆర్ఎస్ పార్టీ నాయకులు అండగా ఉండి వారి పక్షాన పోరాటం చేయాలి. గులాబీ పార్టీ తిరిగి అధికారంలోకి వస్తుంది. **- బానోత్ శంకర్ నాయక్, మాజీ ఎమ్మెల్యే**



హనుమకొండలో కెప్టెన్ లక్ష్మీకాంతరావును సన్మానిస్తున్న ఎమ్మెల్సీ వాణీదేవి, దాస్యం, సతీశ్‌కుమార్

- **ఉద్యమ స్ఫూర్తితో 'స్థానిక' ఎన్నికల్లో సత్తాచాటాలి**
- **ఎమ్మెల్సీ సురభి వాణీదేవి**
- **కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ బీఆర్ఎస్ ఘనతే**
- **హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్**
- **వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమే**
- **రాజ్యసభ మాజీ సభ్యుడు కెప్టెన్ లక్ష్మీకాంతారావు**

# కేసీఆర్ తెలంగాణ దిక్సూచి

హనుమకొండ, నవంబర్ 29 : తెలంగాణ రాష్ట్ర సాధనకు పునాదైన 2009 నవంబర్ 29 తెలంగాణ చరిత్రలో చరిత్రాత్మక రోజని దీక్షా దివస్ జిల్లా ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ వాణీదేవి అన్నారు. హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ అధ్యక్షతన శుక్రవారం జరిగిన దీక్షా దివస్ కార్యక్రమానికి రాజ్యసభ మాజీ సభ్యుడు కెప్టెన్ లక్ష్మీకాంతారావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అమరవీరుల స్తూపానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బీఆర్ఎస్ కార్యాలయంలో తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి, కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం అక్కడే ఉద్యమ ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేసీఆర్ తెలంగాణకు దిక్సూచి అని అన్నారు. అరవై ఏండ్ల కలను సాకారం చేసిన నాయకుడు కేసీఆర్ అని కొనియాడారు. తెలంగాణ ఉద్యమ చరిత్రను భావి తరాలకు తెలియజేయాలన్నారు. ఉద్యమస్ఫూర్తితో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు.

## కలను సాకారం చేసిన వీరుడు కేసీఆర్

ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ఉద్యమ నేత కేసీఆర్ దీక్షకు దిగడం వల్లే కేంద్రం దిగొచ్చింది. కాళోజీ కవితలు, జయశంకర్ సార్ మార్గదర్శనంలో ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లడంతో పాటు అన్ని వర్గాలను, కులాలను కలుపుకొని ఉద్యమించాం. గత ప్రభుత్వం చేసిన పనులకు కొబ్బరికాయలు కొట్టి, శిలాఫలాకాలు మార్చి గొప్పలు చెప్పుకుంటున్నారు. విభజన చట్టంలోని కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ, ములుగు గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు బీఆర్ఎస్, కేసీఆర్ ఘనతే. రాబోయే రోజుల్లో మళ్లీ కేసీఆర్ సీఎం అయ్యే సమయం ఆసన్నమైంది.

**- దాస్యం వినయ్‌భాస్కర్**

## వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమే..

మళ్లీ తెలంగాణలో అధికారంలోకి వచ్చేది బీఆర్ఎస్సే. నవంబర్ 29 ఉద్యమానికి ఊపిరిపోసిన రోజు. తెలంగాణ స్వరాష్ట్ర ఏర్పాటే ధ్యేయంగా పని చేసిన నిఖార్సైన ఉద్యమ నేత కేసీఆర్. కేంద్ర మంత్రి పదవులు, ఎమ్మెల్యే పదవులను తృణప్రాయంగా త్యాగం చేసిన మహానేత. 2009 నవంబర్ 29 దీక్ష దీవస్ ఒక చరిత్ర. నాడు నాయిని నర్సింహారెడ్డి, నేను, రాజయ్య, కేసీఆర్ జైలు జీవితం అనుభవించాం. **- రాజ్యసభ మాజీ సభ్యుడు కెప్టెన్ లక్ష్మీకాంతారావు**

## కేసీఆర్ లేకపోతే రేవంత్‌కు సీఎం సీటు ఎక్కడిది?

కేసీఆర్ లేకపోతే రేవంత్‌రెడ్డికి సీఎం సీటు ఎక్కడిది. సోనియమ్మ దయవల్లే వచ్చిందని ఆమె కాళ్లు కడిగి నెత్తిన పోసుకోవాలని సిగ్గూఎగ్గులేకుండా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతున్నాడు. కేసీఆర్ ఉద్యమమే చేయకుంటే తెలంగాణ వచ్చేదా? రేవంత్ సీఎం అయ్యేవాడా?. తెలంగాణ ఇవ్వకపోతే కాంగ్రెస్ పార్టీకి తెలంగాణలో పుట్టగతులు ఉండవని ఇచ్చారు.

**- ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి**

## అన్ని రంగాల్లో తెలంగాణ అభివృద్ధి

నవంబర్ 29 దీక్షతోనే రాష్ట్ర ఏర్పాటుకు అడుగులు పడ్డాయి. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ఏదో సాధించినట్లు విజయోత్సవాలు చేసుకోవడం విడ్డూరంగా ఉంది. స్థానిక సంస్థల్లో బీఆర్ఎస్ జెండాఎగురవేస్తాం.

**- మాజీ ఎమ్మెల్యే ఎమ్మెల్యే సతీశ్‌కుమార్**

కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య, కార్పొరేషన్ మాజీ చైర్మన్లు నాగుర్ల వెంకటేశ్వర్లు, మర్రి యాదవరెడ్డి, సంగంరెడ్డి సుందర్‌రాజ్ యాదవ్, వాసుదేవరెడ్డి పాల్గొన్నారు.

## ఉద్యమ స్ఫూర్తితో పోరాడాలి


- **పాలన తెలియనోడు సీఎం అయిండు**
- **ఎమ్మెల్సీ, మాజీ మంత్రి సత్యవతి రాథోడ్**

కృష్ణ కాలనీ, నవంబర్ 29: కేసీఆర్ ఉద్యమ స్ఫూర్తితో ప్రజా వ్యతిరేక విధానాలను అనుసరిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉద్యమించాలని ఎమ్మెల్సీ, మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ పిలుపునిచ్చారు. శుక్రవారం భూపాలపల్లిలో మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి ఆధ్వర్యంలో దీక్షా దివస్ కార్యక్రమాన్ని నిర్వహించగా, ముఖ్యఅతిథిగా సత్యవతి రాథోడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా భారీ ర్యాలీగా పార్టీ జిల్లా కార్యాలయానికి వచ్చారు. ఈ సందర్భంగా సత్యవతి రాథోడ్ మాట్లాడుతూ కేసీఆర్ సీఎం పగ్గాలు చేపట్టి ఎండిన భూములను సస్యశ్యామలం చేశారన్నారు. పదేళ్ల కేసీఆర్ పాలనలో పుట్టిన బిడ్డ నుంచి పండు ముసలి వరకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారని పేర్కొన్నారు. పాలన తెలియనోడు, సంక్షేమ పథకాలకు ఖర్చుపెట్టి తెలివి లేని వ్యక్తి తెలంగాణకు సీఎం అయ్యాడన్నారు. గురుకులాల్లో విద్యార్థులు పిట్ట గొడుగుల్లా రాలుతుంటే కనీసం పట్టించుకోవడంలేదని, నిన్న ఓ మహిళా మంత్రి విద్యార్థులు చావడంలో రాజకీయ కుట్ర ఉందని, సిగ్గులేని మాటలు మాట్లాడడం బాధాకరమన్నారు.


## సూర్యచంద్రులు ఉన్నంత వరకు ప్రజల గుండెల్లో కేసీఆర్

సూర్యచంద్రులు ఉన్నంతవరకు తెలంగాణ ప్రజల గుండెల్లో మహానాయకుడు కేసీఆర్ పేరు ఉంటుంది. ప్రపంచంలో అభివృద్ధి చెందిన దేశాలతో తెలంగాణను అభివృద్ధి చేశారు. దీనికి ఉదాహరణ భూపాలపల్లేనని, వెనుకబడిన ప్రాంతాన్ని జిల్లా కేంద్రం చేసి, కార్పొరేట్ పట్టణంగా తయారు చేసిన మహానాయకుడు కేసీఆర్. అమలు కాని దొంగ హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికీ ఏ ఒక్కటీ నెరవేర్చకుండా సిగ్గు లేకుండా విజయోత్సవాలు జరుపుతున్నారు.

**- గండ్ర వెంకటరమణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే**



వరంగల్‌లో అమరవీరుల స్తూపానికి నివాళులర్పిస్తున్న ఎర్రబెల్లి, ముత్తిరెడ్డి, నన్నపునేని, చల్లా



జనగామలో దీక్షా దివస్‌కు భారీగా తరలివచ్చిన బీఆర్ఎస్ శ్రేణులు

# చరిత్రలో చిరస్థాయిగా కేసీఆర్ పేరు

- **సోనియమ్మ ఇస్తే రాష్ట్రం రాలే మెడలు వంచితే వచ్చింది**
- **ములుగు జిల్లా దీక్షా దివస్ ఇన్‌చార్జి మారపెల్లి సుధీర్‌కుమార్**

ములుగు, నవంబర్ 29 (నమస్తే తెలంగాణ) : ఉద్యమ నేత కేసీఆర్‌తోనే ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం సాధ్యమైందని.. ఆయన పేరు చరిత్రలో చిరస్థాయిగా ఉండిపోతుందని హనుమకొండ జడ్పీ మాజీ చైర్మన్, ములుగు జిల్లా దీక్ష దివస్ ఇన్‌చార్జి డాక్టర్ సుధీర్‌కుమార్ అన్నారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్‌రావు అధ్యక్షతన ములుగులోని బీఆర్ఎస్ భవన్‌లో నిర్వహించిన దీక్ష దివస్ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత తెలంగాణ తల్లి, కేసీఆర్ చిత్రపటాలకు ములుగు జడ్పీ మాజీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి, లక్ష్మణ్‌రావులతో కలిసి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా సుధీర్‌కుమార్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం సోనియమ్మ ఇస్తే రాలేదని, ఢిల్లీ మెడలు వంచితే వచ్చిందన్నారు. సబ్బండ వర్గాలు, సకల జనులను సమీకరించి ఉద్యమం చేయడంతో పాటు కేసీఆర్ ఆమరణ దీక్ష చేస్తే ఢిల్లీ గడగడలాడి తెలంగాణ ఇవ్వక తప్పదని తెలిసి తెలంగాణ ఇచ్చారని చెప్పారు. ఈ రోజు రాష్ట్రం బాగుపడిందంటే కేసీఆర్ అది పుణ్యమేనని పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వం అబద్ధాలకు కేరాఫ్‌గా మారిందని మండిపడ్డారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ పోరిక గోవింద్‌నాయక్ పాల్గొన్నారు.

## కేసీఆర్‌తోనే సాధ్యమైంది

నీళ్లు, నిధులు, నియామకాలతో పాటు అన్ని విధాలుగా సమైక్య పాలకులు తెలంగాణను అణచివేశారు. కేసీఆర్ ఉద్యమ కెరటంగా ఉవ్వెత్తున లేచి లక్షలా మందితో సైన్యాన్ని సిద్ధం చేసి తెలంగాణ కోసం తన ప్రాణాలను ఫణంగా పెట్టి స్వరాష్ట్రాన్ని సాధించారు. ములుగు ప్రాంతంతో పాటు తెలంగాణ ప్రాంతంలో గుక్కెడు నీళ్లు కూడా గతి లేవని, స్వరాష్ట్రం ఏర్పడి కేసీఆర్ ముఖ్యమంత్రి అయిన తర్వాత ప్రతి ఇంటికి నీటిని అందించడంతో పాటు సంక్షేమ పథకాలతో ప్రజల్లో ఆనందం నింపారు.

**- జడ్పీ మాజీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి**

## కేసీఆర్‌ను ఎప్పటికీ మరచిపోరు..

ఉద్యమానికి ఊపిరి పోసి రాష్ట్రాన్ని సాధించిన ఘనత కేసీఆర్‌దే. ఆయన పదేళ్లు అధికారంలో ఉన్న సమయంలో దేశంలోనే ఏ రాష్ట్రంలో సాధ్యం కాని అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు అందించారు. ఇప్పుడు ప్రతిపక్షంలోనూ ప్రజల కోసం బీఆర్ఎస్ పోరాడుతుంది. తెలంగాణ తెచ్చిన కేసీఆర్‌ను ప్రజలు ఎన్నటికీ మరువరు.

**- బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్‌రావు**

## చరిత్రను మలుపు తిప్పిన రోజు

ఖిలావరంగల్, నవంబర్ 29: కేసీఆర్ ఉద్యమ ఫలితమే నేటి బంగారు తెలంగాణ అని మాజీ మంత్రి ఎర్రబెల్లి అన్నారు. శుక్రవారం ఉర్సులోని నాని గార్డెన్‌లో దీక్షా దివస్‌ను మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమంలోని పలు కీలకమైన ఘట్టాలను వీడియో రూపంలో ప్రదర్శించారు. అలాగే ఫొటో గ్యాలరీ ఏర్పాటు చేశారు. తెలంగాణ అమరవీరుల స్తూపం, తెలంగాణ తల్లికి పూలమా లలు వేసి నివాళులర్పించారు. కేసీఆర్ భారీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.

## మోసపోయి గోసపడుతున్నాం

కాంగ్రెస్ పార్టీ మాయమాటలను నమ్మి అధికారంలోకి తీసుకువచ్చి ప్రజలు గోసపడుతున్నారు. ప్రస్తుత సీఎంను మే నెలలోపు ఆ పార్టీకి చెందిన నాయకులే దించేస్తారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలు బీఆర్ఎస్‌ను గెలుపించుకునేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారు. జమిలీ ఎన్నికలు వస్తే కేసీఆరే ముఖ్యమం త్రి అవుతారు. ఓరుగల్లు కేంద్రంగా కేసీఆర్ ఉద్యమంలో అనేక యాత్రలకు శ్రీకారం చుట్టి సక్సెస్ అయ్యారు.. అదే స్ఫూర్తిని ప్రజలు చాటాలి.

**- ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, దీక్షా దివస్ జిల్లా ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే**

## గులాబీ జెండా తోడుగా ఉంటది

ప్రతి కార్యకర్తకు గులాంబీ జెండా తోడుగా ఉంటుంది. బీఆర్ఎస్ అంటేనే ప్రజల పార్టీ. నాడు ఉద్యమంలో ఎన్ని కేసులు పెట్టినా భయపడకుండా రాష్ట్రాన్ని సాధించుకున్నాం. దీక్షా దివస్ రోజున కేటీఆర్‌ను వరంగల్ జైలులో పెట్టారు. రాబోయే ప్రభుత్వం కేసీఆర్‌దే. సింహం బయటకు వస్తే తోడేళ్లు కూడా పారిపోతాయి. కాంగ్రెస్ కార్యకర్తలు సల్లబడ్డారు. ఏస్తరు, తీస్తరు, పొడుస్తరనుకొని అనుకున్నరు కానీ ఇప్పుడు ఎవరికి వాళ్లే పొడుసుకుంటున్నారు.

**- మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్**

## ఆనవాళ్లు చెరిపేయలేరు

కేసీఆర్ చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు, ఆనవాళ్లను చెరిపివేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పడం విడ్డూరంగా ఉంది. తరాలు మారినా కేసీఆర్ పరిపాలనా దక్షత ప్రజలపై చెరగని ముద్రలాగా నిలిచిపోయింది. కేసీఆర్ రాష్ట్రం సాధించడం వల్లే ఈ రోజు రేవంత్ సీఎం అయిండు అనే సంగతి గుర్తుపెట్టుకోవాలి. కేసీఆర్ సాహసోపేత నిర్ణయాలతో సంక్షేమానికి పెద్దపేట వేశారు. నాటి కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమం గురించి ఆలోచించలేదు.

**- చల్లా ధర్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే**

## కీలుబొమ్మగా తెలంగాణ

రాష్ట్రం దొంగల చేతిలో కీలుబొమ్మగా మారింది. కేసీఆర్ మళ్లీ రావాలని ప్రజ ల ఆకాంక్ష బలంగా ఉంది. ఆత్మ బలిదానాలు చేసుకున్న వారి మరణ వాంగ్మూలంలో రేవంత్‌రెడ్డి పేరుంది. కేసీఆర్ మార్చిలో వరంగల్ వేదికగా బయటకు వస్తున్నాడు. స్థానిక సంస్థల ఎన్నికలనగానే కాంగ్రెసోళ్లు భయపడుతున్నారు. కార్యకర్తలపై దాడులు, పోలీసుల వేధింపులను సమర్థవంతంగా ఎదుర్కొంటాం. ఇప్పుడున్న మూ డు ఫీట్ల సీఎం మూడు నెలలు ఉంటరో లేదో తెలియదు. **- పెద్ది సుదర్శన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే**